# కలం స్నేహం

## పి.ఎల్. సుశీల



"స్నేహమేరా జీవితం... స్నేహమేరా శాశ్వతం" అన్నపాట ఎక్కడినుండో వచ్చి నా చెవిని తీయగా తాకింది. నిజమే! స్నేహమే జీవితం. స్నేహమే శాశ్వతం... అని నాకు అనుభవపూర్వకంగా తెలిసింది. ఈ ప్రపంచంలో ఎన్నో బంధాలు, అనుబంధాలు ఉన్నాయి. అవి ప్రేమ కావచ్చు... పెళ్ళి కావచ్చు... వీటికి అతీతమైన అద్భుతమైన బంధం స్నేహబంధం.

నా ఆలోచనలు 3 సంవత్సరాల వెనుకకు మరలాయి. దినపత్రికలు చదవడం నా హాబీ. ఒకరోజు ఒక దినపత్రిక తిరగేస్తున్నాను. 'కలం స్నేహం' అన్న పేజీ దగ్గర ఆగాను. ఎప్పుడూ ఆ పేజీని పెద్దగా పట్టించుకోలేదు. ఒకరికొకరు ఎదురుగా ఉండి చేసే స్నేహాలే నిలబడట్లేదు. ఇక, కనీసం ముఖ పరిచయం కూడా లేని కలం స్నేహాలేమి నిలుస్తాయిలే అని నా అభిప్రాయం. కానీ ఎందుకో ఒక అడ్రస్‌కి సరదాగా లెటర్ రాసి చూస్తే పోలా అనిపించింది... అనుకున్నదే తడవుగా ఒక అడ్రస్‌ని ఎంచుకుని కలం, కాగితం తీసుకుని లెటర్ రాసి పోస్ట్ చేసాను. అతని పేరు విజయ్... కర్నాటకలో ఇంజనీర్‌గా చేస్తున్నాడు. అతనికి లెటర్ రాసిన తరువాత మంచి జవాబుకోసం ఎదురుచూడటం మొదలుపెట్టాను.

సరిగ్గా వారం రోజుల తరువాత అతని పూర్తి వివరాలతో నా స్నేహాన్ని అంగీకరిస్తూ జవాబు రాసాను. అతనెలా ఉంటాడో ఏమో? నాకు తెలియదు. తెలుసుకోవాలని అనిపించలేదు. నేను ఎలా ఉంటానో ఆయనకి తెలియదు. అతను లెటర్ రాసే విధానం ... అక్షరాల పొందికలోనే అతని మనసులోని స్వచ్ఛత, పవిత్రతత కనిపించింది... కొంతమంది అబ్బాయిలు అమ్మాయి లెటర్ రాసింది అనగానే కొంతకాలం స్నేహం చేసి దానికి మరలా 'ప్రేమ' అనే రంగు పులిమి స్నేహాన్ని అపవిత్రం చేస్తారు. కాని విజయ్... అందుకు భిన్నంగా కనిపించాడు. తనది చాలా సున్నితమైన స్వభావం. ఊరిలోని విశేషాలతో మొదలైన మా ఉత్తరాలలో కాలేజీ కబుర్లు, కష్టసుఖాలు, కుటుంబ విషయాలు, సినిమా కబుర్లు నిండి ఉండేవి. ఉత్తరాల్లో తిట్టుకునేవాళ్ళం, అల్లరి చేసేవాళ్ళం, బాధని పంచుకునేవాళ్ళము, ఓదార్చుకునేవాళ్ళము, ధైర్యం చెప్పుకునేవాళ్ళం, తప్పొప్పులు సరిదిద్దుకునేవాళ్ళం. ఒకరికొకరు ఎదురుగా ఉండి ఉంటే ఇంత చెలిమి చేసేవాళ్ళమా! నాకే ఆశ్చర్యమనిపిస్తుంది.

కొన్ని పరిచయాలు ఎవరితో, ఎందుకు, ఎప్పుడు, ఎలా జరుగుతాయో తెలియదు. కొన్ని పరిచయాలు చిరునవ్వులు మిగల్చవచ్చు, తియ్యని బంధాలుగా మారవచ్చు. అనుకోకుండా విడిపోనూ వచ్చు... ప్రతి పరిచయం గతజన్మ తాలూకు తీయని ఋణానుబంధం కావచ్చు... లేదంటే విజయ్ ఎవరో? నేను ఎవరో? అతని అడ్రస్ వెతుక్కుని మరీ అతనికి లెటర్ రాసి పోస్ట్ చేయడమేమిటి? అనిపిస్తుంది.

విజయ్‌ని నేను ఏరోజూ చూడాలని అనుకోలేదు... మన చుట్టూ ఉన్న మనుష్యుల్ని చూడగానే ఒక విధమైన అభిప్రాయానికి వచ్చేసి... వారిలో కొంతమంది విలువైన వ్యక్తులని మనం గుర్తించలేకపోతాము... నేను విజయ్‌ని చూసిన తరువాత అతని స్నేహాన్ని అశ్రద్ధ చేస్తానేమో... దానివల్ల అతని విలువైన స్నేహాన్ని నేను పొందలేనేమో అన్న భయం వల్ల అతనిని చూడాలని అనుకోలేదు...

'పోస్ట్' అన్న కేకతో నా ఆలోచనలు వాస్తవంలోకి వచ్చాయి. సుస్మితాగారు మీకే... పెళ్ళి శుభలేఖ అంటూ పోస్ట్‌మాన్ శుభలేఖ నా చేతిలో పెట్టాడు. అది విజయ్.... పెళ్ళి శుభలేఖ. తన పెళ్ళి కుదిరినట్లు తన పెళ్ళికి తప్పనిసరిగా రావాలంటూ రాసాడు. నిజం చెప్పాలంటే ముందుగా నా పెళ్ళి జరిగిన తరువాతే తను పెళ్ళి చేసుకుంటానని పట్టుబట్టాడు. ఇద్దరి వివాహాలు జరిగిన తరువాత నేను నా భర్తతో.... తను తన భార్యతో కలిసి మొదటిసారిగా ముఖ పరిచయాలు చేసుకోవాలని మా ఒప్పందం.. కానీ నా పెళ్ళికి ఇంకా సమయం ఉంది. ఎందుకంటే నేను అత్త కొడుకుని ప్రేమించాను. అతను నన్ను ప్రేమించాడు. మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాము. బావ అమెరికాలో ఉద్యోగానికై వెళ్ళి 6 నెలలు మాత్రమే అయ్యింది. తను తిరిగి రావడానికి ఒక సంవత్సరం పట్టచ్చు. అందుకోసం విజయ్‌ని తన పెళ్ళి వాయిదా వేసుకోవద్దని పట్టుబట్టడంతో ఒప్పుకున్నాడు.

ఆత్రంగా శుభలేఖ తెరిచాను. అమ్మాయి పేరు "వందన" పేరు చాలా బావుంది. మనసుకి చాలా ఆనందమనిపించింది, విజయ్ ఒక ఇంటివాడు అవుతున్నాడని. ఇంతలోనే నాలో ఒక సంశయం బయలుదేరింది. ఇంతవరకూ అతనితో నా స్నేహం చాలా సాఫీగా సాగుతోంది. కానీ అతని జీవితంలోకి అతని జీవిత భాగస్వామి అడుగుపెట్టబోతోంది. ఆమె మా పవిత్రమైన స్నేహాన్ని అపార్థం చేసుకుంటే అతని జీవితం ఏమవుతుంది! అన్న ఆలోచనలు బయలుదేరాయి. కొన్ని పరిచయాలు ఏదో ఒక చోట ఆగిపోక తప్పదు... అని అనిపించింది. అది ఒక అబ్బాయికీ అమ్మాయికీ మధ్య పెళ్ళిళ్ళు అయ్యాకా స్నేహాలు కుదరవేమో? అనిపించింది... మనసుకి ఎంతో బాధని కల్గించినా అతని స్నేహాన్ని ఒక తీయని జ్ఞాపకంగా మిగుల్చుకుని అతనితో నా స్నేహం నిలిపివేయాలని నిర్ణయించుకున్నాను. అలా అని తనకి తెలిపితే బాధపడతాడని అతని పెళ్ళికి వెళ్ళకుండా, గ్రీటింగ్స్, గిఫ్ట్ పోస్ట్ చేసి మౌనంగా ఉండిపోయాను. నా మౌనాన్ని అతను అర్థం చేసుకుని లెటర్స్ రాయడం మానేస్తాడని అనుకున్నాను. కానీ తన నుండి లెటర్ వచ్చింది. తన లెటర్‌తో పాటుగా విజయ్ భార్య వందన రాసిన లెటర్ కూడా ఉంది... చాలా ఆత్రంగా లెటర్ చదివా... విజయ్‌తో నా పెళ్ళి జరిగిన తరువాత మీ స్నేహాన్ని నేను అపార్థం చేసుకుంటానేమో అని మీరు విజయ్ స్నేహాన్ని వదలవల్లసిన అవసరం లేదు. ఎన్నో స్నేహాల గురించి విన్నాను. కానీ మీ పవిత్రమైన స్నేహాన్ని ఇప్పుడే చూసాను. కేవలం ఒక్క లెటర్ ద్వారా ఇంత మంచి స్నేహితులుగా మారిన మీ స్నేహానికి హ్యాట్సాఫ్! నా రాకతో మీ అందమైన స్నేహం ఆగకూడదు.... అని రాస్తూ తను నాతో స్నేహం చెయ్యాలని అనుకుంటున్నట్లు దానికి నా అంగీకారం తెలపమంటూ రాసింది. ఆమె లెటర్‌లో నాకు అర్థం చేసుకునే ఆమె మనసు, అపార్థాలకు చోటు ఇవ్వని ఆమె సంస్కారం కనిపించాయి. ఆనందంతో కళ్ళు చెమ్మగిల్లాయి.

విజయ్‌తో నా స్నేహాన్ని మానేయాలని కలం మూసిన నేను మరలా నా కలాన్ని తెరచి కలం స్నేహం ప్రారంభించాను. అదీ విజయ్, వందనలతో... వారిని ఎప్పటికి చూస్తానో! కలుస్తానో నాకు తెలియదు. మా స్నేహం ఎంతవరకూ స్థిరమో తెలియదు. తెలిసిందల్లా ఒక్కటే! వారి పరిచయాల్ని నా మనసు పుస్తకంలో పదిలపరచుకోవడం. వారితో ఉత్తరాల్లో నేను పంచుకున్న తీయని అనుభూతుల్ని తల్చుకుని మురిసిపోవడం...

అదీ ఎంతవరకూ అంటే నాలో శ్వాస ఉన్నంతవరకూ... అంతవరకూ నా కలానికి... స్నేహానికి అడ్డు వచ్చేవారు ఎవరూ లేరుగా మరి.


❀




జాగింగ్ చేయాల్సిన జంజాటం లేదు వ్యాయమం (ఎక్సర్‌సైజ్) చేయాల్సినయిబ్బంది లేనేలేదు **వెయిట్ కేర్** మీ బరువును ఇట్టే తగ్గించే ఫటాఫట్

**Weight Care**™

సంపూర్ణ సురక్షిత ఆయుర్వేదిక స్లిమ్మింగ్ క్యాప్స్యూల్




**లావు నుండి విముక్తి... బరువును తగ్గించుకోండి, జీవితంలో హుషారును పెంచుకోండి.** ● అన్ని మెడికల్ స్టోర్‌లో లభిస్తుంది.

PUJA ADS/16-TELGU